ఇంటర్నల్ మార్కులు ఆన్‌లైన్‌లోకి..

● టెన్త్ అంతర్గత మార్కుల తనిఖీ పూర్తి ● ఆన్‌లైన్‌లో నమోదుకు విద్యాశాఖ కసరత్తు
● ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు 20 మార్కులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మానిటరింగ్ బృందాలు తనిఖీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాయి. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలలకు వెళ్లి పరిశీలించాయి. విద్యార్థుల్లో సొంత ఆలోచనలకు ప్రాధాన్యమిస్తూ దాదాపు 9 ఏళ్ల నుంచి విద్యాశాఖ సీసీఈ(నిరంతర సమగ్ర మూల్యాంకనం) విధానాన్ని అమలు పరుస్తోంది. ఈ విధానంలో భాగంగానే ప్రతి ప్రతిసంవత్సరం అంతర్గత(ఇంటర్నల్) మార్కుల పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గత విద్యా సంవత్సరం 6 పరీక్షలు నిర్వహించగా, ఈసారి ప్రభుత్వం సామాన్య శాస్త్రంకు రెండు పరీక్షలు కేటాయించడంతో మొత్తం ఏడు పరీక్షలు జరగనున్నాయి. దీంతో అంతర్గతంగా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వేయనున్న 20 మార్కులకు ప్రాధాన్యం సంతరించుకుంది.

18 నుంచి వార్షిక పరీక్షలు...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి మొత్తం 880 ఉండగా, ఇందులో 46,838 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరంతా మార్చి 18 నుంచి వార్షిక పరీక్షలు రాయనున్నారు. 80 మార్కులకు ఈ పరీక్షలు ఉంటాయి. మిగిలిన 20 మార్కులను తరగతి ప్రాజెక్ట్ వర్క్, ల్యాబ్ బుక్, సమకాలీన సామాజిక సమస్యలు, నోట్‌బుక్, ఎస్‌ఏ 12.3.4లో వచ్చిన మార్కులు, ప్రయోగాల నిర్వహణ తదితరాలపై ఆధారపడి ఉంటాయి. ఈ మార్కులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వేస్తారు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా వేశారా? లేదా అనేది ఈ నెల 9 నుంచి 17 వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మానిటరింగ్ బృందాలు సంబంధిత పాఠశాలలకు వెళ్లి పరిశీలించాయి. ఇటీవలే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కూడా వీటికి సంబంధించిన నివేదికలను కూడా అందజేశారు. పరిశీలన చేసిన బృందంలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఇద్దరు సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే.., ఈ నెల 22 నుంచి 29 వరకు అంతర్గత మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు:	105
పదో తరగతి విద్యార్థులు:	9,100
ప్రైవేట్ పాఠశాలలు:	775
పది విద్యార్థులు:	37,738

రుణం.. పని తీరే ఆధారం!



● పొదుపు సంఘాలకు ఇకపై గ్రేడింగ్ విధానం
● రెండు జిల్లాల్లో 22,580 స్వయం సహాయక సంఘాలు
● పోటీతత్వం పెంచేందుకు ఉపయుక్తం

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వపరంగా, బ్యాంకుల రుణాలను సకాలంలో చెల్లిస్తున్న వారిలో సింహభాగం మహిళా సంఘాలవే. బ్యాంకు అధికారులు సైతం ఈ పొదుపు సంఘ సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం రకరకాల ప్రయోగాలకు రూపకల్పన చేస్తోంది. ఈక్రమంలోనే తాజాగా 'గ్రేడింగ్' విధానం తీసుకొచ్చింది. సంఘాలను మరింత పటిష్టం చేయాలన్న లక్ష్యంతో ఈ విధానం అమలు చేయనున్నారు.

గ్రేడింగ్ ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 22,580 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా 2,43,244 మంది సభ్యులున్నారు. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 3,383 స్వయం సహాయక సంఘాలు ఉండగా 36,553 మంది సభ్యులు ఉన్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో 19,192 స్వయం సహాయక సంఘాలు ఉండగా 2,06,691 మంది సభ్యులు ఉన్నారు. గ్రేడింగ్ విధానంలో మహిళా సంఘాలకు ఎనిమిది అంశాల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇవ్వనున్నారు. ఒక్కో సంఘం 75 శాతానికి పైగా లక్ష్యాలు సాధిస్తే 'ఏ' గ్రేడ్, 60 శాతం కంటే తక్కువ సాధిస్తే 'డీ', అంతకంటే దయనీయంగా ఉంటే 'ఈ' గ్రేడ్‌గా నిర్ణయిస్తారు.

ఇప్పటి వరకు గ్రామైక్య సంఘాలకు మాత్రమే గ్రేడింగ్ విధానం అమలులో ఉంది. ఏ, బీ, సీ గ్రేడింగ్‌ల్లో ఉన్న గ్రామైక్య సంఘాలకే స్త్రీనిధి రుణాలు కేటాయిస్తున్నారు. కాగా, ఇక మీదట క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకూ ఇదే నిబంధన వర్తించనుంది. గ్రేడింగ్‌లో వెనకబడితే బ్యాంకు, స్త్రీనిధి రుణాలు పొందటం ఇకపై కష్టమే.

పెరగనున్న అధికారుల పర్యవేక్షణ

గ్రేడింగ్ విధానం అమలులోకి రావటంతో మహిళా సంఘాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగనుంది. ఇప్పటికే సమావేశాలకు సంబంధించి లైవ్ ఫొటో తప్పనిసరి చేశారు. అంతేకాకుండా రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈక్రమంలో తరచూ సమావేశాల నిర్వహిస్తూ రుణాల చెల్లింపులో వెనుకబడిన సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రేడింగ్‌ల్లో ఎప్పుడూ ముందుండేలా సంఘాల వారీగా నివేదికలు తెప్పించుకుని సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో సంఘ సభ్యుల్లో పోటీతత్వం అలవడి మరింత సక్రమంగా లావాదేవీల నిర్వహణకు అవకాశం ఉంటోంది.

నిర్దేశించిన అంశాలు..

ప్రతినెలా రెండుసార్లు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. అంతేకాకుండా సమావేశాలకు పూర్తిస్థాయిలో సభ్యుల హాజరు కావాలి. వీటితో పాటు ప్రతినెలా క్రమం తప్పకుండా పొదుపు చేయడం, అంతర్గత రుణాల చెల్లింపులు, సామాజిక పెట్టుబడి నిధి(సీఐఎస్ఎఫ్) అప్పు కట్టడం, స్త్రీనిధి రుణ వాయిదాలతో పాటు గ్రామ సంఘానికి సంబంధించిన రుణ వాయిదాలతో పాటు బ్యాంకు అప్పు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



ఘట్‌కేసర్: ఎదులాబాద్ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం సేవాకాలం, ప్రాభోదక ఆరగింపు, పరమ దినోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, నేడు(శుక్రవారం) జరగనున్న స్వామి వారి తిరుక్కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ధర్మకర్తలు ఆహ్వానం పలికారు. గురువారం జరిగిన పూజల్లో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పలాచార్యులు, రాంప్రసాద్ ఆచార్యులు, వరదాచార్యులు పాల్గొన్నారు.

నాగారంలో టయోటా షోరూం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మహరాజ్ ముఖర్జీ, నీరావ్‌మోడీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు పరిధిలో టయోట కార్ షోరూంను జీఎం మహరాజ్ ముఖర్జీ, మేనేజింగ్ డైరెక్టర్ నీరావ్ మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యతతో కూడిన సర్వీస్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్, సీఎఫ్‌ఓ రవిప్రకాశ్, సేల్స్ వైస్ ప్రెసిడెంట్ రమణ, సేల్స్ సర్వీస్ జీఎం కోటి శ్రీనివాస్, కంపెనీ పీఆర్‌ఓ నరేశ్ వలిశెట్టి, కాలనీవాసులు గుండు మధు గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణకు రూ.85 లక్షలు



మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: చెత్త డంపింగ్‌తో పాటు తరలింపు పనుల కోసం 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.85.75 లక్షలు కేటాయించినట్టు చైర్మన్ కొండల్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కొండల్‌రెడ్డి అధ్యక్షతన అత్యవసర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల యంనంపేట్‌లోని డంపింగ్‌యార్డులో మంటల వల్ల పొగలు వ్యాపించడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. నోటీసులో పేర్కొన్న విధంగా డంపింగ్‌యార్డుకు చెత్తను తరలింపునకు రూ.30 లక్షలు కేటాయించామని చెప్పారు. అందేవిధంగా యంనంపేట్ డంపింగ్ యార్డు చుట్టూ ఫెన్సింగ్ కోసం రూ.50 లక్షలు, శానిటేషన్ సామగ్రి కోసం రూ.5.75 లక్షలు విడుదల చేసేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'తూంకుంట' కౌన్సిలర్ల వినూత్న ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కౌన్సిలర్లు

శామీర్‌పేట్: అవిశ్వాసం ప్రవేశపెట్టిన తూంకుంట మున్సిపాలిటీ కౌన్సిలర్లు గురువారం వినూత్న ర్యాలీ నిర్వహించారు. 11 మంది మంది కౌన్సిలర్లు కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి తాము కూడా మద్దతు ఇస్తామని 1వ వార్డు కౌన్సిలర్ పూజ, భర్త భరత్‌సింగ్ ప్రకటించారు. అయితే, మాట తప్పడంతో ఆగ్రహించిన కౌన్సిలర్లు ఫ్లెక్సీలతో ర్యాలీ తీశారు.

పూజా భరత్‌సింగ్ సస్పెండ్..

పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేఖంగా పనిచేసిన కౌన్సిలర్ పూజ, ఆమె భర్త భరత్‌సింగ్‌ని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌లో ఉంటూ బీఆర్‌ఎస్‌కు కొమ్ము కాస్తున్నందున భరత్‌సింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

ప్రత్యేకాధికారి పర్యటన



కీసర: గోధుమకుంట గ్రామంలో గురువారం గ్రామ ప్రత్యేకాధికారి పి.రవీందర్ పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులతో పాటు నీటి వసతులు, ఇంటి పన్నుల వసూళ్లు చేస్తున్న విధానంతో పాటు నర్సరీలను గ్రామ కార్యదర్శి సురేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.1.60 లక్షలు మంజూరు



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాచారం డివిజన్ ఎరుకుల బస్తీకి చెందిన మైసమ్మ కుమార్తె జ్యోతి అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్‌గౌడ్ పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీ ద్వారా రూ.1.60 లక్షలను మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం వారి కుటుంబ సభ్యులకు మందముల పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నూతనకంటి రాజు, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, అబ్రహం, గద్ద క్రాంతి, శ్రీనివాస్‌రెడ్డి, మునీర్, ప్రవీణ్‌చారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం రూ.1.10 లక్షలు



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: మౌలాలి డివిజన్‌కు చెందిన రాణిలావణ్య అనారోగ్యంతో బాధపడుతోంది. సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీకి దరఖాస్తు చేసుకోగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ రూ.1.10 లక్షల పత్రాన్ని గురువారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రాణి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పూడూర్ సబ్‌స్టేషన్ రామాలయం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా నేడు(శుక్రవారం) పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శిధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మునీరాబాద్ గ్రామంతో పాటు గ్రామ పరిధిలోని వ్యవసాయ, ఇండస్ట్రియల్ కనెక్షన్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

నేడు కాశీవిశ్వనాథుడి కల్యాణం

మేడ్చల్: స్థానిక రామలింగేశ్వర ఆలయంలోని అన్నపూర్ణ కాశీవిశ్వనాథుడి కల్యాణోత్సవం నేడు(శుక్రవారం) నిర్వహించనున్నట్టు మేడ్చల్ అయ్యప్ప ఆలయ గురుస్వామి రాజేశ్వర్ గుప్తా గురువారం తెలిపారు. సాయంత్రం 8 గంటలకు నిర్వహించే కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అడిషనల్ కలెక్టర్‌ని కలిసిన కమిషనర్



జవహర్‌నగర్: మేడ్చల్–మల్కాజిగిరి అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యను జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, అకౌంటెంట్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను పలువురు నాయకులు గురువారం సత్కరించారు. మునీరాబాద్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కుతాడి నరేందర్, డబిల్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ సురేశ్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు సీఐను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఏసీపీ



కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని గురువారం కుషాయిగూడ ఏసీపీ నరేశ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న నరేశ్‌రెడ్డికి వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అభిషేక పూజ నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనంతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలింగం తదితరులున్నారు.

వక్ఫ్ బోర్డు స్థలం పేరుతో ఇబ్బందులు



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కార్పొరేటర్, కాలనీవాసులు

● 40 ఏళ్ల నుంచి లే అవుట్‌లో క్రయవిక్రయాలు
● అన్ని అనుమతులు లభించినా తప్పని తిప్పలు
● ప్రభుత్వమే సమస్యకు పరిష్కారం చూపాలి
● మంత్రులకు వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న వక్ఫ్ బోర్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆర్‌ఎన్‌ఎస్ కాలనీ వాసులు మంత్రులు దుద్దిల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి స్థానికంగా చేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పుడు వక్ఫ్ బోర్డు స్థలంగా చూపి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ప్రస్తుతం ఎలాంటి క్రయవిక్రయాలు జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పురుషోత్తమరావు, కుంభం శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణానికి చొరవ చూపండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ విభాగం అధికారులను కోరారు. గురువారం ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్ట్ విభాగం నార్త్ జోన్ ఎస్‌ఈ రవీందర్‌రాజుతో సమావేశమయ్యారు. మల్కాజిగిరి సర్కిల్‌లో వాజుపేయినగర్, గౌతంనగర్, సఫిల్‌గూడ, కాకతీయనగర్, వినాయకనగర్, ఆల్వాల్ సర్కిల్ పరిధిలోని వెంకటాపురం, లయోలా కాలేజీ ప్రాంతాల్లో రైల్వే గేట్ల వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారి దృష్టికి తీసుకొనివచ్చారు. ఎంఎంటీఎస్ రెండవ దశలో భాగంగా రైళ్లు ప్రారంభిస్తే ట్రాఫిక్ రద్దీ ఎక్కువవుతుందన్నారు. ఆర్‌కేపురం వద్ద ప్రస్తుతం ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రస్తుత పరిస్థితుల్లో సరిపోవడం లేదని, అదనంగా మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వారికి సమస్యను వివరించారు. సమావేశంలో ఈఈలు సురేష్, రాధిక, డీఈలు రాంచందర్, సుదర్శన్, ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇలాంటి ఘటన పునరావృతమైతే కఠిన చర్యలు

కుషాయిగూడ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ



డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్ స్వామి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: కుషాయిగూడ ఆరోగ్య ఉపకేంద్రం అద్దె బాగోతం కథనాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుషాయిగూడ ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం సందర్శించారు. వార్త ప్రతికల్లో వచ్చిన కథనాలపై విచారణ చేపట్టారు. ఉప కేంద్రం సిబ్బందిని మందలించి మెమోలు జారీ చేశారు. తిరిగి ఇలాంటి ఘటన పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రంలోని గదిలోని కుండలతో పాటు సామగ్రిని తొలగించారు. అలాగే పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను అక్కడి నుంచి తొలగించారు. ఉప కేంద్రంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, హెచ్‌ఈఓ శ్యాంసుందర్, ఏఎన్‌ఎం మహేశ్వరి, వరలక్ష్మి, స్థానిక నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, పొండాల శివకుమార్‌గౌడ్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, బాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



నేరేడ్‌మెట్ ప్రభుత్వ కళాశాలలో కార్యక్రమం

అల్వాల్: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఐసీటీ సెల్ ఏసీపీ నరేందర్ అన్నారు. షేర్ అంబ్రేల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ అధ్యక్షతన సైబర్ మోసాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఐసీటీ సెల్ ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్లను మంచి పనులకే వాడాలన్నారు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ, షేర్ అంబ్రేల్లా ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ విజయ అర్చన, ఎస్‌ఐ శ్రీనివాస్, కో–ఆర్డినేటర్ చంద్రలేఖ, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్స్ డాక్టర్ జగన్, మల్లిక, డాక్టర్ రచన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో' విజయవంతానికి చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ సరితారెడ్డి

కీసర: ఐదేళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకున్నట్టు కీసర మండల వైద్యాధికారి డాక్టర్ సరితా రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కోసం నిర్వహించిన టాస్క్ పోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 3వ తేదీన కీసర పీహెచ్‌సీ సెంటర్ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎండీపీఓ గ్యామ నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, ఎంపీటీసీ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో స్వచ్ఛత కార్యక్రమం



మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాలలో గురువారం ఇందుస్థాన్ స్కౌట్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ విద్యార్థులతో కలిసి స్కౌట్స్ జెండా ఎగురవేశారు. అనంతరం విద్యార్థులు మేడ్చల్ శివాలయంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు మనోజ్ ఎంపిక



మనోజ్‌ను సత్కరించిన వెంకట్ రెడ్డి

కీసర: రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు బోగారం గ్రామానికి చెందిన చుంచు మనోజ్‌కుమార్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మనోజ్‌ను ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బోగారం గ్రామ యువకులు పాల్గొన్నారు.

నిందితుడికి జైలు శిక్ష

మేడ్చల్: ఆరేళ్ల క్రితం మేడ్చల్ పరిధిలోని సుతారిగూడ ఔటర్ టోల్ ప్లాజా వద్ద జరిగిన ప్రమాదంలో నిందితుడైన లారీ డ్రైవర్‌కు మేడ్చల్ న్యాయస్థానం జైలుశిక్షతో పాటు జరిమానా విధించింది. మేడ్చల్ ఏఎంఎం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు.. 2016 సంవత్సరం ఆగస్టు 31వ తేదీన మేడ్చల్ పరిధిలోని ఔటర్ రింగు రోడ్డుపై లారీ డ్రైవర్ సైలేందర్ పాండే(45) నిర్లక్ష్యంగా లారీ నడుపుతూ సుతారిగూడ టోల్ ప్లాజా వద్ద ఓ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో 8 మంది మృతిచెందారు. మేడ్చల్ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేయగా మేడ్చల్ ఏఎంఎం కోర్టు న్యాయమూర్తి దిలీప్ నాయక్ గురువారం తీర్పు వెల్లడించారు. సైలేందర్ పాండేకు రెండేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.11 వేలు జరిమానా విధించారు.

అనాథలకు చేయూత అందించాలి

బోడుప్పల్: అనాథలకు తమవంతు చేయూత అందించాలని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ పిలుపునిచ్చారు. ఆమె పెళ్లి రోజు సందర్భంగా స్థానికంగా ఉన్న అమ్మ ఆశ్రమం, కరుణ రథం ఆశ్రమంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అనాథలకు తమవంతు తోచిన సాయం అందించాలన్నారు. అనాథ ఆశ్రమంలో అన్నదానం చేయడం తనకు ఎంతో తృప్తి ఇచ్చిందన్నారు. ప్రతి సంవత్సరం తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.